01-07-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మీరు మీ తనువు, మనస్సు, ధనముల ద్వారానే భారత్ ను పావనముగా తయారుచేసే సేవను చేయాలి, ఈ భారత్ ను మాయా రావణుడి నుండి విడిపించాలి"

ప్రశ్న:- ఏ పిల్లలైతే దేహీ-అభిమానులుగా ఉండేందుకు పురుషార్థము చేస్తారో, వారు ఏ చింత నుండి విముక్తులవుతారు?

జవాబు:- ఈ పాత శరీరపు కర్మభోగము ఏదైతే ఘడియ-ఘడియ దుఃఖము రూపంలో వస్తుందో, లెక్కాచారాలు ఏవైతే తీర్చుకోవలసి వస్తుందో, ఈ చింత నుండి వారు విముక్తులవుతారు ఎందుకంటే - ఇప్పుడు మేము పాత లెక్కాచారాలను సమాప్తం చేసుకుని కర్మాతీతులుగా అవ్వాలి, మళ్ళీ అర్ధకల్పం కోసం ఏ విధమైన రోగమూ మా వద్దకు రాలేదు అని వారి బుద్ధిలో ఉంటుంది. బాబా ఎటువంటి ఫస్ట్ క్లాస్ నేచర్ క్యూర్ చేస్తారంటే, దాని ద్వారా ఇక రోగం యొక్క నామ-రూపాలు మిగలవు.

పాట:- నీవే తల్లివి, తండ్రివి... (తుమ్హీ హో మాతా, పితా తుమ్హీ హో...)

ఓం శాంతి. పిల్లలు పాటను విన్నారు. మేము పతిత-పావనుడైన మాత, పిత సమ్ముఖంలో కూర్చున్నామని పిల్లలకు తెలుసు. మీరు పతిత భారత్ ను పావనంగా తయారుచేయడానికి శ్రీమతంపై నడుస్తున్నారు ఎందుకంటే పిల్లలైన మీరు మీ పరమపిత పరమాత్ముని సేవలో ఉన్నారు. తండ్రి కూడా ఈ సేవలోనే ఉన్నారు. తప్పకుండా భారత్ పావనంగా ఉండేదని, ఇప్పుడు పతితంగా అయ్యిందని పిల్లలకు తెలుసు. పావన ప్రపంచము 5 వేల సంవత్సరాల క్రితం ఉండేది. ప్రపంచానికి ఈ విషయాల గురించి ఏమీ తెలియదు. ఇప్పుడు పిల్లలైన మీరు తండ్రి శ్రీమతంపై నడుస్తూ తనువు-మనస్సు-ధనముల ద్వారా భారత్ యొక్క సేవను చేస్తారు. భారత్ ను మాయా రావణుడి సంకెళ్ళ నుండి విడిపించి రామ రాజ్యాన్ని స్థాపన చేస్తున్నారు. ఇది మీరు ఎవరికైనా అర్థం చేయించవచ్చు. నేను పతిత భారత్ ను పావనంగా తయారుచేయడానికి వచ్చాను, కావున మీరు తప్పకుండా పవిత్రంగా అవ్వాల్సి ఉంటుంది. పవిత్రత విషయంలోనే గొడవలు జరుగుతాయి. ఏదో ఒక ఇబ్బంది కలుగుతుంది. వారిది హింసాత్మకమైన యుద్ధము, మీది రావణ రూపీ 5 వికారాలతో జరిగే యుద్ధము. కల్ప-కల్పము మనం శ్రీమతంపై నడిచాము అని కూడా మీకు తెలుసు. ఈ సమయంలో మొత్తం ప్రపంచమంతా రావణుని మతంపై నడుస్తుంది. శ్రీమతము ద్వారా మీరు దైవీ మతము కల దేవతలుగా అవుతారు. ఇప్పుడు మీరు బ్రాహ్మణ వర్ణానికి చెందినవారిగా ఉన్నారు. మీరు మొత్తం ప్రపంచమంతటినీ పతితం నుండి పావనంగా చేస్తారు. అనంతమైన తండ్రి పిల్లల వద్దకు వస్తారు. పిల్లలు అంటారు - మేము తనువు-మనస్సు-ధనముల ద్వారా భారత్ ను మళ్ళీ దైవీ రాజ్యంగా తయారుచేస్తాము ఎందుకంటే భారత్ సత్యయుగ ఆదిలో రాజ్య స్థానంగా ఉండేది. మనం మన దైవీ రాజ్యాన్ని స్థాపన చేస్తున్నాము. ఏ విధంగానైతే బాపూ గాంధీ తమ తనువు-మనస్సు-ధనములతో సేవ చేసారు. జైలుకు వెళ్ళారు అంటే అది తనువు ద్వారా సేవ అయినట్లు కదా! మనస్సు కూడా అందులోనే నిమగ్నమై ఉండేది. ఇప్పుడు తండ్రి మాయా రావణుడి నుండి విముక్తులుగా చేస్తారని మీకు తెలుసు. వీరు అనంతమైన తండ్రి, వారు భారత్ కు బాపూజీ, అంతేకానీ అందరికీ తండ్రి కాదు. ఆ మాటకొస్తే వృద్ధులను కూడా బాపూజీ అని అంటారు. అలాగే మేయర్ ను కూడా బాపూజీ అని అంటారు. అలా తండ్రులు ఎంతో మంది ఉన్నారు. మీ తండ్రి ఒక్కరే, ఇంకెవ్వరూ కాదు. అనంతమైన తండ్రి ఒక్కరే - శివబాబా, వారు భారత్ ను పావనంగా చేసే సేవలో ఉపస్థితులయ్యారు. తప్పకుండా ఏదో ఒక శరీరములోకి వచ్చి ఉంటారు. వారితో పాటు సహాయకులు కూడా ఉంటారు. వారు ఒక్కరే ఉండరు. మీరు శివశక్తి సైన్యము. మీరు చాలా సహజముగా అర్థం చేయించవచ్చు. వారు భారత్ ను స్వతంత్రంగా చేసేందుకు ఎంత సహనం చేసారు. అబలలు కూడా జైళ్ళకు వెళ్ళారు. అక్కడ ఎక్కువ దుఃఖాన్ని పురుషులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు మళ్ళీ మాతలైన మీరు విషం కారణంగా ఎంతో దుఃఖాన్ని సహనం చేయాల్సి వస్తుంది.

తండ్రి కొత్త సృష్టిని రచించేందుకు వచ్చారని మీరు అర్థం చేయించవచ్చు. కావున మొట్టమొదట బ్రాహ్మణులు కావాలి. బ్రహ్మ ముఖ వంశావళి బ్రాహ్మణులైన మీరు మళ్ళీ దేవతలుగా అనగా విష్ణు వంశావళిగా అవుతారు. ఇది బుద్ధిలో ఉండాలి. తప్పకుండా మనం బాబాతో పాటు సహాయకులుగా ఉన్నాము. శ్రీమతముపై వేలాదిమంది, లక్షలాదిమంది నడవాల్సి ఉంటుంది. బాపూజీకి కూడా పెద్ద సైన్యము ఉండేది. అందులో కొందరు మంచి పేరు-ప్రఖ్యాతులు కలవారు

ఉండేవారు, కొందరు సాధారణమైనవారు ఉండేవారు. ఆ బాపూజీ ఆంగ్లేయుల నుండి విడిపించారు. ఇప్పుడు పిల్లలైన మిమ్మల్ని శత్రువైన రావణుడి నుండి విడిపించేందుకు శ్రీమతాన్ని ఇస్తున్నారు. ఎలాగైతే వారు - మేము స్వరాజ్యాన్ని స్థాపన చేస్తాము అని అంటారో, అలా మీ బుద్ధిలో - మేము శ్రీమతముపై దైవీ స్వరాజ్యాన్ని స్థాపన చేస్తున్నాము అని ఉంది. అడుగడుగులోనూ శ్రీమతం తీసుకోవాల్సి ఉంటుంది. శ్రీమతము ద్వారా శ్రేష్ఠంగా అవుతారు. ప్రతి ఒక్కరి కర్మబంధనము ఎవరిది వారిదే. కర్మాతీత అవస్థను పొందేందుకు అంతిమం వరకూ పురుషార్థం చేయాల్సి ఉంటుంది. కర్మాతీత అవస్థ ఇప్పుడింకా రాలేదు. ప్రస్తుతం ఇంకా ఎంతో పురుషార్థం చేయాలి. కర్మాతీత అవస్థ ఎటువంటిదంటే, అందులో శరీరానికి కూడా ఏ విధమైన దుఃఖమూ కలగదు. పాత శరీరానికైతే అంతిమం వరకూ దుఃఖము కలుగుతూనే ఉంటుంది. అందరూ సంపూర్ణులు అయిపోయారని కాదు. కర్మభోగాన్ని సమాప్తం చేసుకోవాల్సి ఉంటుంది. ఎప్పటివరకైతే కర్మాతీత అవస్థ ఏర్పడదో, అప్పటివరకూ మాయా తుఫానులు, కర్మల లెక్కాచారాల దుఃఖము వస్తూనే ఉంటాయి. వాటి విషయంలో చింతించకూడదు. తండ్రిని స్మృతి చేయాలి. తండ్రి అంటారు - దేహీ-అభిమానీ భవ. ఈ పదాలు ఈ సమయానికి చెందినవే, ఇవి గాయనం చేయబడతాయి. దీని అర్థం ఏమిటి అనేది మనుష్యులకు తెలియదు. ఆత్మాభిమానులుగా అవ్వడం ద్వారా మనం ఒంటరిగా అయి తండ్రిని స్మృతి చేయగలము అని ఇప్పుడు మీకు తెలుసు. ఇప్పుడు ఆత్మాభిమానులుగా అవ్వాలి. నేను ఆత్మను, తండ్రిని స్మృతి చేస్తున్నాను - అని పురుషార్థం చేయాలి. సర్వవ్యాపి అని అన్నట్లయితే మనం ఎవరిని స్మృతి చేయాలి? తండ్రి అర్థం చేయించారు - శాంతి కొరకు ఎక్కడికి వెళ్ళవలసిన పని లేదు. కర్మలైతే చేయాల్సిందే. అశరీరిగా అయి ఉండాలి. నేను ఆత్మను, ఇవి ఇంద్రియాలు. ఆత్మకు స్వధర్మమే శాంతి. మనం వాయిద్యాలను మోగించము. ఆ సన్యాసులు మొదలైనవారైతే హఠయోగం చేస్తారు, ప్రాణాయామం చేస్తారు. గోతులలోకి వెళ్ళి అనేక ప్రయత్నాలు చేస్తారు, అభ్యాసాలు చేస్తారు. ఇక్కడ హఠయోగము యొక్క విషయమేమీ లేదు. కేవలం జ్ఞానాన్ని అర్థం చేసుకోవాలి. గాడ్ ఫాదర్ ఇచ్చే జ్ఞానము గురించి ఎవ్వరికీ తెలియదు. గాడ్ ఫాదర్ సర్వవ్యాపి అని అనేస్తారు. దీనినే అసత్యమైన జ్ఞానము అని అంటారు. ఇప్పుడు మీకు తండ్రి గురించి తెలుసు. అందరికీ తండ్రి ఒక్కరే. వారే వచ్చి సృష్టిని పతితం నుండి పావనంగా చేస్తారు. మీరు తండ్రితో పాటు సహాయకులుగా ఉన్నారు. పతితుల నుండి పావనులుగా అయి మళ్ళీ పావన ప్రపంచంలోకి వెళ్తారు. అక్కడ పావన దైవీ రాజ్యం ఉంటుంది. పావన ప్రపంచం కొరకు మీరు రాజయోగాన్ని నేర్చుకుంటున్నారు. వారు టీచర్ గా అయి మీకు సృష్టి చక్రం యొక్క జ్ఞానాన్ని ఇస్తారు. తద్వారా మీరు స్వదర్శన చక్రధారులుగా అయి చక్రవర్తీ రాజు-రాణిగా అవుతారు. గృహస్థ వ్యవహారంలో ఉంటూ ఈ అవస్థను తయారుచేసుకోవాలి. మీరు ఎంతగా సహనం చేయాల్సి ఉంటుంది! ఎన్ని దెబ్బలు తింటారు, ఈ యజ్ఞములో అసురుల విఘ్నాలు ఎన్ని కలుగుతాయి! వికారాల కారణంగా అబలలపై అత్యాచారాలు జరుగుతాయి. కాంగ్రెస్ వారు ఆ జైలుకు వెళ్ళేవారు, మీరేమో కంసుడు-జరాసంధుడి జైలులో బంధించబడతారు. కొంత సహనం చేయాల్సి ఉంటుంది. పావనంగా అవ్వడంలో మెజారిటీ మీదే (మాతలదే) ఉంది. అయితే, ఎవరైనా బలహీన పురుషులు ఉంటే, వారు స్త్రీని సహనం చేయాల్సి వస్తుంది. నిజానికి భారతవాసుల నియమం ఏమిటంటే - 60 ఏళ్ళ తర్వాత వానప్రస్థావస్థను ధారణ చేయాలి, అప్పుడిక గృహస్థాన్ని వదిలి, మీరు సంభాళించండి అని తాళంచెవిని పిల్లలకు ఇచ్చేస్తారు. సుపుత్రులైన పిల్లలు మంచి రీతిలో సంభాళిస్తారు. తండ్రి సేవ చేసి పెద్దవారిగా చేసారు, ఇక పిల్లల బాధ్యత సంభాళించడము. మీరు సత్సంగాలు మొదలైనవాటికి వెళ్ళండి, మేము సంభాళిస్తాము అని పిల్లలు అంటారు. ఈ రోజుల్లో పిల్లలు కూడా శత్రువులుగా అవుతున్నారు. పిల్లలైన మీ యుద్ధము మాయా రావణుడితో జరుగుతుంది. వారు గాంధీ మతము ద్వారా ఆంగ్లేయుల నుండి విముక్తులుగా చేసారు.

మీపై మాయా రావణుడు 2500 సంవత్సరాలు రాజ్యం చేసాడు. ఈ మాయ చాలా శక్తివంతమైనది. వారిని విముక్తులుగా చేయడానికి 40-50 సంవత్సరాలు పట్టింది. శ్రమించవలసి ఉంటుంది. ఇక్కడ కూడా మీరు శ్రీమతంపై విజయం పొందుతారు. రావణుడు మీకు పెద్ద పురాతన శత్రువు. మాయా శత్రువు మిమ్మల్ని దెబ్బ తీస్తుంది. కామానికి సంబంధించినది అన్నింటికన్నా పెద్ద బాంబు. మాయతో చాలా జాగ్రత్తగా ఉండాలి. బాబా అంటారు - ఎంతగా మీరు స్మృతి చేస్తారో అంతగా సంతోషమనే పాదరసము పైకి ఎక్కుతుంది. మీకు తెలుసు - మనం ఈశ్వరుని సంతానముగా అయ్యాము. శ్రీమతము ద్వారా 21 జన్మల కొరకు స్వరాజ్యాన్ని స్థాపన చేస్తాము. కాంగ్రెస్ వారు అల్పకాలము కొరకు స్వరాజ్యము తీసుకున్నారు. అదేమీ స్వరాజ్యము కాదు, అందులో ఇంకా కష్టము ఉంటుంది. వారికి ఎండమావుల వంటి రాజ్యం లభించిందని మీకు తెలుసు. కాంగ్రెస్ ఏ విధముగా తయారయ్యింది అనేది ఏ గీతలో కానీ, భాగవతములో కానీ లేదు. వారికేమీ లభించలేదని ఇప్పుడు మీరు అర్థం చేసుకున్నారు. ఎక్కువలో ఎక్కువ ఎం.పి.గా అవుతారు, అది కూడా అల్పకాలికంగా అవుతారు. ఇప్పుడైతే అందరూ దుఃఖితులుగా ఉన్నారు. మనం స్వర్గాన్ని స్థాపన చేస్తున్నాము. డ్రామాలో మీ విజయమైతే నిశ్చితమై ఉంది. మీరు రాజయోగాన్ని నేర్చుకుంటున్నారు. మనం సూర్యవంశీయులుగా

అవుతామని మీకు తెలుసు. బాబా అడుగుతారు - మీరు సూర్యవంశీయులుగా అయ్యేందుకు పురుషార్థము చేస్తున్నారా లేక చంద్రవంశీయులుగా అయ్యేందుకా? అప్పుడు, మేము సూర్యవంశీయులుగా అయ్యేందుకు చేస్తున్నాము అని అంటారు. మమ్మా-బాబా అని అంటూ ఉండేవారు తప్పకుండా సూర్యవంశీయులుగానే అవుతారు. దీనినే తల్లి-తండ్రిని అనుసరించడము అని అంటారు. వీరు తల్లి-తండ్రి కదా! వీరు సూర్యవంశీ మహారాజు-మహారాణిగా అవుతారు. ఈ విషయంలో అందరికీ 100 శాతం నిశ్చయం ఉంది. మీరు కూడా పురుషార్థము చేసి సింహాసనాధికారులుగా అవ్వాలి అని తల్లి-తండ్రి పిల్లలకు చెప్తారు. పురుషార్థము చేసి ఫాలో చేయాలి.

ఎవరైనా శుభం మాట్లాడితే - అచ్ఛా, మీ నోటిలో గులాబి అని అంటారు. అరే, సూర్యవంశీయులుగా అవ్వడమంటే అదేమైనా తక్కువ విషయమా! ఎంతగా వజ్ర-వైఢూర్యాలతో అలంకరించబడిన మహళ్ళు ఉంటాయి! అది ఎంత ఉన్నతమైన పదవి! ఆలోచిస్తే రోమాలు నిక్కబొడుచుకుంటాయి. బాబా మనల్ని ఎంత ఉన్నతంగా తయారుచేస్తున్నారు! మనకు అసలేమీ తెలిసేది కాదు. పల్లెటూరి బాలుడు అన్న గాయనముంది కదా. శ్రీకృష్ణుడేమీ పల్లెటూరి బాలుడు కాదు. ఇక్కడకు పల్లెటూరివారు ఎంతమంది వచ్చారు! పేదవారికే ఈ సౌభాగ్యముంది. షావుకార్ల హృదయం విదీర్ణమైపోతుంది. తండ్రి అంటారు - నేను ఉన్నానే పేదల పాలిటి పెన్నిధిని. వారసత్వాన్ని తీసుకునేందుకు ఎవరెవరు వస్తారో మీరు చూస్తారు. కావున ఎవరైనా కలిసినప్పుడు - మేము భారత్ యొక్క సేవలో ఉన్నాము, తనువు-మనస్సు-ధనములతో భారత్ ను స్వర్గముగా తయారుచేసే సేవను చేస్తాము అని చెప్పండి. అప్పుడు ఎవరైనా ఇన్-కమ్ టాక్స్ ఆఫీసరు ఉంటే వారు మీకు వెంటనే మాఫీ చేస్తారు. ఆ గవర్నమెంట్ వద్దనైతే ఎంతో ధనము వృథా అవుతుంది. మీ ధనమైతే భారత్ ను సుసంపన్నంగా చేస్తుంది. ఎంత తేడా ఉంది? ఎవరికైనా అర్థం చేయిస్తే వారు ఆశ్చర్యపోతారు - ఓహో! వీరు ఎంతో గొప్ప సేవ చేస్తున్నారు. ఇటువంటి సేవ చేయండి. చాలా-చాలా మధురంగా అవ్వండి. సత్యమైన స్వామితో సత్యంగా ఉండాలి. సత్యమైన స్వామిని స్మృతి కూడా చేయాలి. ఒకవేళ సత్యఖండానికి యజమానులుగా అవ్వాలంటే సత్యమైన తండ్రిని నిరంతరం స్మృతి చేసే అభ్యాసం చేయండి. స్మరిస్తూ-స్మరిస్తూ సుఖాన్ని పొందండి. కలహ-క్లేశాలు దూరమైపోయినవారు ఇంకెవ్వరూ లేరు. ఏదో ఒక రోగము మొదలైనవి ఉంటూనే ఉంటాయి. అక్కడ మీకు ఏమీ ఉండదు. తండ్రి ఎటువంటి నేచర్ క్యూర్ చేస్తారంటే దాని ద్వారా మీరు ఎప్పటికీ రోగులుగా అవ్వరు. 21 జన్మలు మీరు నిరోగులుగా అయిపోతారు. కావున అంతటి నషాలో ఉండాలి. పాండవులు ఏమి చేసారు, కౌరవులు ఏమి చేసారు, ఆ బాపూజీ ఏమి చేసారు, ఈ అనంతమైన బాపూజీ ఏమి చేస్తారు... ఆ తేడాను అర్థం చేయించండి. తండ్రి మిమ్మల్ని రావణుడి సంకెళ్ళ నుండి విడిపిస్తారు. ఆ తండ్రిని స్మృతి చేయడం ద్వారా మీ వికర్మలు వినాశనమవుతాయి. వారు తండ్రి కూడా, టీచర్ కూడా, సద్గురువు కూడా. జన్మ-జన్మాంతరాల పాపాలు తలపై ఉన్నాయి. వాటి నుండి పావనులుగా అయ్యేందుకు ఒకే ఉపాయము ఉంది. ఆ నీటి గంగ ఎవరినీ పావనంగా చేయదు. ఈ తండ్రి స్మృతే పావనంగా చేస్తుంది. అలాగని నిష్ఠలో కూర్చుండిపోవడం కాదు. అయితే కూర్చోవడం కూడా మంచిదే. పరస్పరం ఒకరి శక్తితో ఒకరు కూర్చుండిపోతారు. ఎలాగైనా కూర్చోండి, కానీ స్మృతినైతే నడుస్తూ-తిరుగుతూ, కార్యాలు చేస్తూ చేయాలి. ఆ స్కూల్లో టీచర్ చదివిస్తారు కావున విద్యార్థులు టీచర్ ను తప్పకుండా స్మృతి చేయాల్సి ఉంటుంది. మమ్మల్ని బాబా చదివిస్తున్నారు అన్నది పిల్లల బుద్ధిలో కూర్చుండిపోవాలి. తండ్రిని మరియు టీచర్ ను తలచుకోనివారంటూ ఎవ్వరూ ఉండరు. ఇప్పుడు తిరిగి వెళ్ళాలని మీకు తెలుసు కావున సద్గురువును కూడా స్మృతి చేయాల్సి ఉంటుంది. మీరు అద్భుతమైన విషయాలను వినిపిస్తారు. మన తండ్రి, టీచర్, సద్గురువు - సత్యమైన తండ్రి, సత్యమైన టీచర్, సద్గురువు. సత్యమైన సాంగత్యమే తీరాన్ని చేరుస్తుంది అనగా ముక్తి-జీవన్ముక్తులలోకి తీసుకువెళ్తుంది. ఈ పాత ప్రపంచం నుండి అందరూ తిరిగి వెళ్తారు. మళ్ళీ వచ్చి కొత్త ప్రపంచంలో రాజ్యం చేస్తారు. ఇది మీ రేస్, అనంతమైన గుర్రపు పందెము. మేము ముందు చేరుకోవాలి అని అందరూ అంటారు, మరి దాని కోసం స్మృతి చేయవలసి ఉంటుంది. విద్యార్థుల చేత పరుగు తీయించడం జరుగుతుంది. ఎంతగా పురుషార్థం చేస్తారో అంతగా విజయ మాలలో కూర్చబడతారు. అచ్ఛా!

మాతా-పిత బాప్ దాదాల మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు ప్రాణప్రదమైన, ప్రియాతి ప్రియమైన ప్రియస్మృతులు. మీరు చాలా ప్రియమైనవారిగా అవుతారు. మనమందరము పూజ్య దేవీ-దేవతలుగా ఉండేవారము, తర్వాత పూజ్యులైన మనమే రెండు కళలు తగ్గి క్షత్రియులుగా, చంద్రవంశీయులుగా అయ్యాము. మళ్ళీ మనమే పూజారులుగా, వైశ్యవంశీయులుగా, శూద్రవంశీయులుగా అయ్యాము. ఇప్పుడు మళ్ళీ మనం శ్రీమతం ద్వారా పూజారుల నుండి పూజ్యులుగా అవుతున్నాము. ఈ చక్రాన్ని బుద్ధిలో తిప్పాలి. అచ్ఛా - ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి

నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. భారత్ ను సుసంపన్నంగా తయారుచేయడంలో మీ తనువు, మనస్సు, ధనము అన్నింటినీ సఫలం చేసుకోవాలి. చాలా, చాలా మధురంగా అయి సేవ చేయాలి. సత్య ఖండాన్ని స్థాపన చేయడానికి సత్యంగా అవ్వాలి.

2. విజయమాలలో స్మరించబడేందుకు స్మృతి రేస్ ను చేయాలి. నడుస్తూ-తిరుగుతూ, కార్యాలు చేస్తూ తండ్రి-టీచర్-సద్గురువును స్మృతి చేయాలి.

వరదానము:- త్యాగము మరియు తపస్య యొక్క సహయోగం ద్వారా సేవలో సఫలతను ప్రాప్తి చేసుకునే నిరంతర తపస్వీమూర్త భవ

సేవాధారి అనగా త్యాగీ మరియు తపస్వీమూర్తి. త్యాగము మరియు తపస్య, ఈ రెండింటి సహయోగం ద్వారా సేవలో సదా సఫలత లభిస్తుంది. తపస్య అంటే ఒక్క తండ్రి తప్ప మరెవ్వరూ లేకుండా ఉండడము, నిరంతరము ఇదే తపస్య చేస్తూ ఉన్నట్లయితే మీ సేవా స్థానము తపస్యా కుండముగా అయిపోతుంది. ఇటువంటి తపస్యా కుండాన్ని తయారుచేసినట్లయితే దీపపు పురుగులు వాటంతట అవే వస్తాయి. మనసా సేవ ద్వారా శక్తిశాలీ ఆత్మలు ప్రత్యక్షమవుతాయి. ఇప్పుడు మనసా ద్వారా ధరణిని పరివర్తన చేయండి - ఇదే వృద్ధి చేసేందుకు విధి.

స్లోగన్:- నమ్రత మరియు ఓర్పు యొక్క శక్తితో క్రోధాగ్నిని శాంతముగా చేయండి.